క్లుప్తంగా

ఓటుహక్కును వినియోగించుకోవాలి



కృష్ణా: మండలంలోని హిందుపూర్‌లో శనివారం రాత్రి స్పెషల్ ఫోర్స్ బృందంతో కలిసి పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్‌ఐ రామస్వామి మాట్లాడుతూ.. ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండగా అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలి



నారాయణపేట రూరల్: శాసనసభ ఎన్నికల దృష్ట్యా ఈ నెల 29, 30న ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించాలని డీటీఎఫ్ జిల్లా నాయకులు సూర్యచంద్ర, చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అడిషనల్ కలెక్టర్ అశోక్‌కు వినతిపత్రం అందించారు. వివిధ చోట్ల నుంచి డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు వచ్చేందుకు, ఎన్నికల నిర్వహణ ప్రాంతానికి వెళ్లడానికి తిరిగి స్వస్థలాలకు చేరుకునేందుకు టీచర్లకు ఇబ్బంది కల్గకుండా రవాణా సదుపాయం ఉండేలా చూసుకోవాలని కోరారు.

రక్తదాన శిబిరం



కోస్గి: భగవాన్ సత్యసాయి బాబా జయంతి సందర్భంగా శనివారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక ప్రజ్ఞా జూనియర్ కళాశాలలో నిర్వహించిన ఈ రక్తదాన శిబిరంలో 37మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు విష్ణు, వెన్న శేఖర్‌తోపాటు పలువురు పాల్గొన్నారు.

గ్రామాల్లో రోడ్‌షో..



దామరగిద్ద: మండలంలోని శనివారం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి చిట్టెం పర్ణికారెడ్డి ఆయా గ్రామాల్లో రోడ్‌షో నిర్వహించారు. ఈ మేరకు.. ఆమె మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా ఒక్కసారి గెలిపించి అవకాశామివ్వాలని ఓటర్లను కోరారు.

ఓటమి భయంతోనే..



కోస్గి: రేవంత్‌రెడ్డి ఓటమి భయంతో యువకులను రెచ్చగొట్టి అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరి ప్రచారం వారు చేసుకొని ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోకుండా బయటి వ్యక్తులను రప్పించి దాడులకు దిగడం సరికాదన్నారు.

బీజేపీ రోడ్‌షో



ధన్వాడ: మండలంలోని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి రతంగ్‌పాండురెడ్డి ఆయాగ్రామాల్లో రోడ్‌షో నిర్వహించి మాట్లాడారు.. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే పెట్రోల్, డీజీల్ ధరలను తగ్గించి, సిలిండర్‌లను రూ.400 లకే అందజేస్తామన్నారు.

బీఆర్‌ఎస్‌ను గెలిపించండి



నర్వ: నియోజకవర్గంలో అభివృద్ధి జరగాలంటే బీఆర్ఎస్ తప్పకుండా గెలవాలని ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఓటర్లను కోరారు. శనివారం మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రచారం చేసి ఎమ్మెల్యే మాట్లాడారు..

బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందు దొందే



పంచమ సిద్ధలింగ మహాస్వామిని సన్మానిస్తున్న విజయేంద్ర యడ్యూరప్ప, బీజేపీ అభ్యర్థి జలంధర్‌రెడ్డి

ఆత్మకూర్: బీఆర్ఎస్, కాంగ్రెస్ దొందు దొందేనని, మోసపూరిత హామీలతో మరోసారి మోసం చేసేందుకు పూనుకుంటున్నాయని బీజేపీ మక్తల్ నియోజకవర్గ అభ్యర్థి మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని రేచింతల, వీరరాఘవపూర్, కత్తేపల్లి, తూంపల్లి, ఆరేపల్లి, తిప్డంపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా జలంధర్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యే చిట్టెం అభివృద్ధిని అధోగతి పట్టించారని, చెప్పుకోవడానికి ఒక్కటంటే ఒక్కటి కూడా అభివృద్ధి లేదని దుయ్యబట్టారు. అమలు చేయలేని హామీలతో కర్ణాటకలో గద్దెనెక్కిన కాంగ్రెస్ హామీలు అమలు చేయకుండా చేతులెత్తేసిందని, ఇక్కడి ప్రజలను మోసం చేసేందుకు పూనుకుంటున్నారని ఆరోపించారు.

బీజేపీతోనే సుపరిపాలన

ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో ప్రతి ఒక్కరికీ లబ్ధిచేకూరుతుందని, రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు ఖాయమని జోస్యం చెప్పారు. ఈ నెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్‌కు, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పాలని, నియోజకవర్గ అభివృద్ధి కోసం కమలం గుర్తుకు ఓటువేసి బీజేపీ గెలుపునకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో అశ్విన్‌కుమార్, రేచింతల శ్రీను, నాగేందర్‌రెడ్డి, గోపాల్, శశిధర్ రెడ్డి, చిన్ననర్సింహ, గాడిశేషు, రఘుయాదవ్, బాలకృష్ణ, వెంకట్రాములు, రాము, అశోక్, యశ్వంత్, గోపాల్‌యాదవ్ తదితరులు ఉన్నారు.

మాగనూర్: నేరడగం మఠాన్ని సందర్శించడంతో పాటూ పంచమ సిద్ధలింగ మహాస్వామి ఆశీర్వాదం పొందడం తన పూర్వజన్మ సుకృతం అని బీజేపీ కర్ణాటక రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర యడ్యూరప్ప అన్నారు. శనివారం సాయంత్రం మాగనూర్ మండలంలోని నేరడగం మఠం పీఠాధిపతి ఆశీర్వాదం తీసుకునేందుకు ఆయన ఇక్కడకు వచ్చారు. అంతకు ముందు ఆలయ అర్చకులు, మక్తల్ బీజేపీ అభ్యర్థి జలేంధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పూర్ణ కుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం ఆయన మఠం పీఠాధిపతి అయిన పంచమ సిద్ధలింగ మహాస్వామిని పూలమాల, శాలువాతో సన్మానించారు. అనంతరం అక్కడికి చేరుకున్న బీజేపీ కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థి జలంధర్‌రెడ్డిని గెలుపించాలని కోరారు. బీజేపీ గెలిస్తే మొదట మన సాంప్రదాయాలు, సంస్కృతి, మఠాల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. అనంతరం బీజేపీ నాయకులు విజయేంద్ర యడ్యేరప్పను సన్మానించారు. కార్యక్రమంలో గుర్మిట్‌కల్, కల్లూర్, శాపూర్ పీఠాధిపతులతో పాటూ బీజేపీ నాయకులు కొండయ్య, నారాయణ, కర్నెస్వామి, శ్యామలమ్మ, గంగాధర్‌గౌడ్, రమేష్ గౌడ్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



కత్తేపల్లిలో మాదిరెడ్డి జలంధర్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న మహిళలు

అవకాశమిస్తే సమస్యలు పరిష్కరిస్తాం



వాకిటి శ్రీహరి సమక్షంలో పార్టీలో చేరిన సింగంపేట నాయకులు

అమరచింత: అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరిని ఆదరించి ఎన్నికల్లో ఓటేసి గెలిపిస్తే ప్రధాన సమస్యలు పరిష్కరించడంతో పాటు అభివృద్ధికి చేయూతనిస్తామని టీపీసీసీ గీత కార్మిక సంఘం రాష్ట్ర చైర్మన్ కేశం నాగరాజ్‌గౌడ్ అన్నారు. మండలంలోని నందిమళ్లలో శనివారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని గెలిపించాలంటూ ప్రచారం నిర్వహించారు. ఈమేరకు గ్రామానికి చెందిన సీపీఎం, ప్రజాపంథా నాయకులు తమ గ్రామానికి బీటీ రహదారి వ్యవస్థ లేక ఎన్నో ఏళ్లుగా విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రహదారి నిర్మాణ పనులను గత కృష్ణ పుష్కరాల సమయంలో పూర్తి చేస్తామని పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి తమ గ్రామం వరకు ఉన్న బీటీ రహదారిని పనులను నేటికీ పూర్తి చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు కేశం నాగరాజ్‌గౌడ్ మాట్లాడుతూ దీర్ఘకాలంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆయూబ్‌ఖాన్, చంద్రశేఖర్‌రెడ్డి, తిరుమలేష్, దామోదర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, అరవింద్, బాలరాజ్, మునప్ప, సుధాకర్, చిన్న కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు..

మండలంలోని సింగంపేటలో బీఆర్ఎస్‌కు చెందిన అమరచింత లిఫ్ట్ కార్యదర్శి ఆంజనేయులు ఆధ్వర్యంలో శనివారం నాయకులు మక్తల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో నారాయణ, రాజు, దశరథ్, పాంరెడ్డిపల్లి కృష్ణమూర్తి, రాములు, చిన్న ఆంజనేయులు, ప్రసాద్‌తో పాటు 20 మంది బీఆర్ఎస్‌కు రాజీనామ చేసి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు.



నందిమళ్లలో మాట్లాడుతున్న కేశం నాగరాజ్‌గౌడ్

మక్తల్: అసెంబ్లీ ఎన్నికల్లో మక్తల్ కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరికి మద్దతుగా ఆదివారం కర్ణాటక సీఎం సిద్దరామయ్య నిర్వహించే మక్తల్ రోడ్ షో లో అందరూ పాల్గొనాలని నారాయణపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్‌రెడ్డి, బీకేసీఆర్ చైర్మన్ బాలక్రిష్టారెడ్డి అన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లక్ష్మారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మక్తల్ నియోజకవర్గంలో మాదాసి కుర్వలు, కుర్వలు, యాదవులతో పాటు కాంగ్రెస్ నాయకులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హాజరవుతారన్నారు. మాజీ ఎంపీపీలు హన్మంతు, శ్రీహరి, చంద్రకాంత్‌గౌడ్, గోపాల్‌రెడ్డి, రవికుమార్‌యాదవ్, రాములు ఉన్నారు.

నర్వ: ఆరు గ్యారెంటీ పథకాలతో విజయం ఖాయమని మక్తల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి వాకిటి శ్రీహరి అన్నారు. శనివారం మండలంలోని యాంకి, బెక్కర్‌పల్లి, లంకాల్, పెద్దకడ్మూర్, జక్కన్నపల్లి, కొత్తపల్లి, లక్కర్‌దొడ్డి గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే సీతాదయాకర్‌రెడ్డి, పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి, బంగ్లాలక్ష్మీకాంత్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి, బల్‌రాంగౌడ్, మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్, నాయకులు శరణప్ప, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వివేకేరవర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

గీతవృత్తిదారులకు పెద్దపీట



మరికల్‌లో పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నారాయణపేట/కోయిల్‌కొండ/మరికల్/ధన్వాడ/దామరగిద్ద : సీఎం కేసీఆర్ నేతృత్వంలో కల్లు గీత కార్మికులకు బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేసిందని అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. సింగారం సమీపంలో శనివారం గౌడ సంఘం ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని మాట్లాడారు. గౌడ కులస్తులను కొనియాడారు. రాజేందర్‌రెడ్డిని గెలిపించడం వారికి పెద్ద విషయం కాదన్నారు. బీఆర్ఎస్ ఉమ్మడి పాలమూరు జిల్లా మాజీ అధ్యక్షుడు విఠల్‌రావు ఆర్య, పేట ఎన్నికల ఇన్‌చార్జ్ దేవరి మల్లప్ప, బస్వరాజ్‌గౌడ్, జ్ఞానేశ్వర్‌గౌడ్, గురునాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

- మరికల్ మండల బీజేపీ, బీజేవైఎం నాయకులు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శనివారం పార్టీలో చేరారు. మండల ప్రధాన కార్యదర్శి జానకి రాములు, గ్రామ ప్రధాన కార్యదర్శి మోనేష్‌గౌడ్, నర్సింహులు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నుంచి బుడగ జంగం నారాయణపేట జిల్లా అధ్యక్షుడు ఆర్.శ్రీనివాసులు, దామరగిద్ద మండలం మద్దెల్‌బీడు గ్రామానికి చెందిన 30 మంది యువకులు ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరారు. అదేవిధంగా నారాయణపేట మండలంలోని మేకహనుమాన్ తండా కాంగ్రెస్, బీజేపీకి చెందిన కార్యకర్తలు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.

కష్టపడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని కాంగ్రెస్‌కు అప్పగిస్తే ఆగమయిపోతామని ఎమ్మెల్యే ఎస్. రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం మరికల్ మండలంలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యారంటీ లేని పథకాల పేర్లను చెప్పి అధికారంకోసం తాప్రతాయ పడుతున్న కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ప్రజలు ఆలోచన చేసిఓటు వేయాలన్నారు. మూడోసారి అధికారంలోకి వస్తే ఎన్నికల హామీలను పూర్తిగా నేరవేరుస్తామన్నారు. ప్రస్తుతం రైతులకు యాసంగి రైతుబంధు విడుదల చేశామన్నారు. దేవుడు బీఆర్ఎస్ పక్షాన ఉండటంతో యాసంగి రైతుబంధు రైతుల ఖాతాలో వేసేందుకు ఎన్నికల కమిషనర్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారన్నారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి చూసి బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీవైస్ చైర్మన్ సురేఖ, ఎంపీపీ శ్రీకళ, తిరుపతయ్య, కృష్ణారెడ్డి, లక్ష్మయ్య, బసంత్, సంపత్, రాజేష్, మల్లేష్, శేఖర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం

బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమవుతుందని మాజీఎమ్మెల్యే ఎర్రశేఖర్ అన్నారు. ఎస్.రాజేందర్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన శుక్రవారం కోయిల్‌కొండ మండలంలోని కోత్లాబాద్‌లో ప్రచారం నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజిరెడ్డి, నాయకులు విద్యాసాగర్, మాధువులు, విజయ్‌భాస్కర్‌రెడ్డి, భీంరెడ్డి, చంద్రశేఖర్, పెంటన్న, కనకయ్య, వెంకటయ్య శ్రీనివాస్, మాదవరెడ్డి, గోపాల్, సాయిరాం పాల్గొన్నారు.

ధన్వాడలో మండల ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం సాగింది.

దామరగిద్ద మండలంలోని వివిధ గ్రామాల్లో బీఆర్ఎస్ పార్టీ ముమ్మరంగా ప్రచారం కొనసాగింది.

కోయిలకొండ మండలం శేరివెంకటపూర్‌లో శనివారం ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి మాతృమూర్తి ఎస్.యశోదాదేవి పోస్టల్ బ్యాలెట్ ద్వారా తన ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు.

అందుబాటులో వరి విత్తనాలు

దామరగిద్ద: యాసంగి సాగుకు రైతులకు అవసరమైన వరి, జొన్న, పెసర తదితర విత్తనాలు అందుబాటులో ఉన్నాయని విత్తనాలు తెలంగాణ స్టేట్ సీడ్ కార్పొరేషన్ ఉమ్మడి మహబూబ్‌నగర్ (టీఎస్‌సీడ్స్) జిల్లా రీజినల్ మేనేజర్ రాజీవ్ శనివారం తెలియజేశారు. మహబూబ్‌నగర్, వనపర్తి గోడౌన్‌ల ద్వారా ఆగ్రోస్ రైతు సేవాల కేంద్రాలకు, పీఏసీఎస్ కేంద్రాలకు తరలించి అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. వరి రకాల్లో కేఎన్ఎం -118, జేజీఎల్-24423, ఎంటీయు-1010 రకాల వరి విత్తనా లు 25 కేజీల బస్తా రూ. 880.50లకు అభిస్తుందన్నారు. సన్నరకాల్లో కేఎన్ఎం1638 25 కేజీల బస్తా రూ 880.50 కి లభిస్తుందన్నారు. పెసర 4కేజీల బస్తా రూ. 432, మినుములు 4 కేజీల బస్తా రూ. 424లకు కంది 4కిలోల బస్తా రూ. 452 లకు లభిస్తుందన్నారు. కావాల్సిన రైతులు మండల కేంద్రాల్లోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాల్లో, పీఏసీఎస్ కేంద్రాలో సంప్రదించాలని కోరారు. వివరాలకు రైతులు 9849908753, 9492727142, నంబర్లకు 9440750072 నంబను సంప్రదించాలని కోరారు.

ఎంవీఎస్‌లో ఓటుపై అవగాహన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో ఓటుపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ పద్మావతి విద్యార్థులు తప్పకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలని, తల్లిదండ్రులకు సైతం ఓటుపై అవగాహన కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగేంద్రస్వామి, రిటైర్డ్ అధికారులు బలయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్కసారి అవకాశమివ్వండి..



ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

మక్తల్: నియోజకవర్గ ప్రజలు ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశమిస్తే అభివృద్ధిచేసిచూపిస్తానని బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి వర్కటం జగన్నాథ్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మంతన్‌గోడ్, మక్తల్, మాగనూర్, గురులింగంపల్లి తదితర గ్రామాల్లో ప్రచారం చేసి మాట్లాడారు.. నియోజకవర్గ అభివృద్ధికోసం కృషిచేస్తానని అన్నారు. పేద విద్యార్థులకు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. ఏనుగు గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. అనంతరం వివిధ పార్టీలకు చెందిన కార్యకర్తలు బీఎస్పీలో చేరారు. వారిని పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

పీఈటీలకు ఘన సన్మానం

మక్తల్: వ్యాయామ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శనివారం పట్టణంలోని సత్యసాయిబాబా మందిరంలో విశ్రాంత పీఈటీ గోపాలం ఆధ్వర్యంలో పీఈటీలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు పీఈటీలు మాట్లాడుతూ పదవీరమణ పొందిన తర్వాత గోపాలం సమాజ సేవ కోసం కృషి చేయడం జరుగుతుందని అభినందించారు. కార్యక్రమంలో ప్రభాకర్, స్వరూప, భీంరెడ్డి, రాఘవేందర్, రమేష్, తిరుపతమ్మ, రవి, శ్వేత, శివకుమార్, చంద్రకళ, సునీత పాల్గొన్నారు.



కొనసాగుతున్న తనిఖీలు

అడ్డాకుల: ఎన్నికలు సమీపిస్తున్న వేళ జాతీయ రహదారిపై అడ్డాకుల మండలం శాఖాపూర్ టోల్‌ప్లాజా వద్ద తనిఖీలు ముమ్మరంగా చేస్తున్నారు. ఎన్నికల కోడ్ మొదలైన నాటి నుంచి చెక్‌పోస్టును ఏర్పాటు చేసి పోలీసులు వాహనాల తనిఖీ చేస్తున్నారు. 24 గంటలు రహదారిపై వెళ్లే వాహనాలపై నిఘా పెంచారు. నగదు, మద్యం రవాణాపై నిఘా పెంచారు.

వైభవంగా శ్రీనివాసుడి కల్యాణం

నారాయణపేట రూరల్: మండలంలోని సింగారంలో శనివారం శ్రీనివాసుడి కల్యాణం వైభవంగా కొనసాగింది. శ్రీ చింతలరాయుడి ఆలయం వద్ద బ్రాహ్మణుల వేద మంత్రోచ్ఛరణల మధ్య పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించి అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ నర్సింహారెడ్డి, మాజీ ఎంపీపీ సులోచనమ్మ, భాస్కర్, బాలరాజు, శ్రీనివాస్‌రెడ్డి, హన్మంతు, భజన మండలి సభ్యులు, చిన్నారులు పాల్గొన్నారు.



కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

కారు బోల్తా: ఇద్దరికి తీవ్ర గాయాలు

దేవరకద్ర రూరల్: అదుపు తప్పి కారు బోల్తా పడి, ఇద్దరికి తీవ్ర గాయాలైన ఘటన శనివారం మండల పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం... ఆజిలాపూర్ సర్పంచ్ విశ్వనాథం, మహబూబ్ అలీతో కలిసి శనివారం హైదారాబాద్ నుంచి స్వగ్రామానికి కారులో వెళ్తుండగా తెల్లవారుజామున నాగారం స్టేజ్ సమీపంలో వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. ఘటనలో ఇరువురికి తీవ్రగాయాలు కాగా, గమనించిన స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థుల క్షేత్ర సందర్శన

నారాయణపేట రూరల్ : మండలంలోని లక్ష్మిపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం క్షేత్ర సందర్శనకు తీసుకుని వెళ్లారు. నో బ్యాగ్ డే సందర్భంగా ఉపాధ్యాయులు వారికి మొక్కల పెంపకం ఉపయోగాలు, పండ్లు, పూలు, ఔషద మొక్కలను పరిచయం చేశారు. గ్రామపంచాయతీ పని తీరు వివరించారు. మధ్యాహ్నభోజనం అనంతరం వివిధ రకాలైన ఆటలు ఆడించారు. హెచ్ఎం జనార్దన్‌రెడ్డి, టీచర్లు శ్రీనివాస్, సంధ్య పాల్గొన్నారు.



లక్ష్మీపూర్‌లో విద్యార్థుల క్షేత్ర సందర్శన

వ్యాసరచన పోటీలు..

పట్టణంలోని శ్రీ హంసవాహిని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. రాష్ట్రంలో సాధారణ ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా ఎన్నికల నిర్వహణ, ఓటు హక్కు ప్రాధాన్యత అంశంపై పోటీలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజేష్‌కుమార్, యాజమాన్య సభ్యులు సంతోష్, సుజాత, తిరుపతి, నర్సింహులు, టీచర్లు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మాక్ పోలింగ్



గంగాపురంలో స్లిప్‌లు చూయిస్తున్న విద్యార్థి ఓటర్లు

సాక్షినెట్‌వర్క్: జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులకు ఎన్నికల సరళిపై అవగాహన కలిగించారు. బాదేపల్లి, గంగాపురంలో మాదిరి పోలింగ్‌ను ఎంపీఓ జగదీశ్ సందర్శించారు. రాజాపూర్ మండలంలోని తిర్మలాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం సుధాకర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ పరిధిలోని బోయపల్లి హైస్కూల్‌లో ఈవీఎం యంత్రాలను ప్రదర్శించారు. ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, జీహెచ్ఎం కవిత, ఎస్ఎంసీ చైర్మన్ పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.



బోయపల్లిలో..

జిల్లా కేంద్రంలోని రెయిన్‌బో పాఠశాలలో ప్రిన్సిపాల్ మమత, వైస్ ప్రిన్సిపాల్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



తిర్మలాపూర్‌లో క్యూలైన్‌లో విద్యార్థులు

పోస్టల్ బ్యాలెట్‌లు ఇవ్వాలని వినతి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఎన్నికల శిక్షణలో ఉన్న ప్రభుత్వ సిబ్బందికి సకాలంలో పోస్టల్ బ్యాలెట్‌లు అందించాలని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి, టీజేఏసీ నాయకులు రాజేందర్‌రెడ్డి మహబూబ్‌నగర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనిల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.



పోస్టల్ బ్యాలెట్ ఇవ్వాలని వినతిపత్రం అందజేస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి